క్లుప్తంగా

నిత్యాన్నదాన సత్రానికి విరాళం



మండలాధ్యక్షుడికి నగదు ఇస్తున్న సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు బాసరలోని నిత్యాన్నదాన సత్రానికి రూ.51 వేలు విరాళం అందించారు. ఈమేరకు సభ్యులు గ్రామంలో మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్నకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి భోజన్న, పిప్రి గ్రామ అధ్యక్షుడు రాజేశ్వర్, రాజు, రవి, పోశెట్టి, రాందాస్, శ్రీనివాస్, విలాస్, రాజన్న పాల్గొన్నారు.

నేటి ధర్నాకు తరలిరావాలి

లోకేశ్వరం: కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహించే ధర్నాకు జిల్లాలోని వ్యవసాయ కూలీలు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. మండలంలోని పుస్పూర్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలకు గడ్డపార, తట్ట, పార, పావుడ వంటి పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు రోజుకు రూ.600 చెల్లించి పెండింగ్ వేతనాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముత్తన్న, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణదాస్, గంగారం, రాజన్న, ప్రసాద్, దేవేందర్ ఉన్నారు.

పశువైద్యశిబిరం

మామడ: మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం(ఆవోపా) ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పశుపోషణపై అవగాహన కల్పించారు. అనంతరం రూ.30 వేల విలువైన మందులను పోషకులకు అందించారు. సర్పంచ్ సంతోష్, పశువైద్యాధికారులు శ్రీకర్ రాజు, ఓంప్రకాశ్, ఆర్యవైశ్యసంఘం సభ్యులు విలాస్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, దయానంద్, వెంకటరమణ, గంగాధర్ పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి జితిన్‌కుమార్

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎం.సురేశ్, వెంకట్ మహేంద్ర, ఎం.రాజశేఖర్, కమలాకర్, చంద్రకాంత్, హమీద్, సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ మూడో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు హోమం చేయగా.. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బాలాపూర్ లింగం, దత్తు, సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని డాంగపల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. పింటు మహరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ విఠల్, ఎస్సై సందీప్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మాధవ్‌రావ్ పటేల్, రాములు, పండరి, సాయినాథ్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి’



జాన్సన్‌నాయక్‌ను సన్మానిస్తున్న నేతలు

పెంబి: అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండలంలోని సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్‌లు పూర్ణచందర్‌గౌడ్, సుధాకర్, సుదర్శన్, మహేందర్, రాజు, తానాజీ, సుదర్శన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, దేవేందర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

సోన్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని న్యూవెల్మల్ గ్రామ ఉపసర్పంచ్ గడ్డం స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మరికొందరితో కలిసి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతామని వారు పేర్కొన్నారు.

గోదాంలతో తీరిన ఇబ్బందులు

- లక్ష్మణచాంద మండలంలో ఇప్పటికే మూడు గోదాంలు
- తాజాగా బోరిగాంలో ప్రారంభించిన మంత్రి ఐకేరెడ్డి
- 26,500 మెట్రిక్ టన్నుల పంటను నిల్వ చేసుకునే సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గోదాం ప్రారంభిస్తు, మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్



బోరిగాంలో నూతనంగా నిర్మించిన గోదాం

లక్ష్మణచాంద: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ..పెట్టుబడి సాయం, రైతుబీమా, సాగుకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుంది. ఈదురుగాలులు, అగ్నిప్రమాదాలు, వర్షాలు వంటి వైపరీత్యాల నుంచి రైతులు తమ చేతికొచ్చిన పంటలను నష్టపోకుండా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం గోదాంలను నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చింది. లక్ష్మణచాంద మండలంలో ఇప్పటికే మూడు గోదాంలు ఉండగా.. తాజాగా బోరిగాంలో 20 వేల మెట్రిక్ టన్నులతో నిర్మించిన గోదాంను మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఇటీవల ప్రారంభించారు. దీంతో మండలంలోని నాలుగు గోదాంల్లో 26,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చు. పొట్టపెల్లి(కె)లోని గోదాంలో 2500 మెట్రిక్ టన్నులు, లక్ష్మణచాంద గోదాంలో 2,500 మెట్రిక్ టన్నులు, పీచర గోదాంలో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునే గోదాంలున్నాయి. ఈ గోదాంల ఏర్పాటుతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇబ్బందులు..

గతంలో గోదాంలు లేక మండలంలోని రైతులు చేతికొచ్చిన మొక్కజొన్న, వరి, సోయా వంటి పంటలను ఎక్కడ నిల్వ చేయాలో తెలియక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విక్రయించే ముందు ధాన్యం ఆరబెట్టిన తర్వాత వర్షం కురువడంతో పంట తడిసిపోయేది. దీంతో మళ్లీ అవస్థలు పడుతూ రైతన్నలు పంటను ఆరబెట్టేవారు. అప్పటినుంచి అమ్ముడు పోయే వరకు పంట కుప్పల వద్దనే అన్నదాతలు పడిగాపులు కాసేవారు. దీంతో వారికి ఆర్థికంగా నష్టం వాటిల్లేది. ఈ గోదాంల ఏర్పాటుతో వారి ఇబ్బందులు దూరం కానున్నాయి.

జిల్లాలోనే పెద్ద గోదాం..

లక్ష్మణచాంద మండలంలోని బోరిగాంలో గిడ్డంగులశాఖ ఆధ్వర్యంలో రూ.21.37 కోట్లతో ఇటీవల నిర్మించిన 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను ఇటీవల రాష్ట్ర అటవీ, న్యాయ,దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మిగతా మూడు గోదాంలు 6,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం ఉండగా.. జిల్లాలోనే పెద్దదైన బోరిగాంలో 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునే వీలుంటుంది.

స్థానికులకు ఉపాధి అవకాశాలు..

గోదాంల నిర్మాణంతో ప్రత్యక్షంగా 150 మందికి.. పరోక్షంగా 200 మంది వరకు ఉపాధి లభించనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో గోదాంలున్న గ్రామాలతోపాటు చుట్టు పక్కల వారికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి



గతంలో వర్షాలు, ఈదురుగాలులు, అగ్నిప్రమాదాలు జరిగి రైతులు తమ పంటను నష్టపోయేవారు. మండలంలోని బోరిగాంలో నిర్మించిన గోదాంలో 20 వేల మెట్రిక్ టన్నుల పంటను నిల్వ చేసుకోవచ్చు. దీంతో రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి.

–శివన్న, న్యూకంజర్

గ్రామస్తులకు ఉపాధి



బోరిగాంలో నిర్మించిన గోదాంతో గ్రామస్తులకు ఉపాధి లభిస్తుంది. ఈ ఉద్యోగాలను స్థానికులకే కేటాయిస్తామని అధికారులు తెలిపారు. గోదాం మంజూరుకు కృషి చేసిన మంత్రి ఐకేరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నాం.

– అర్జున్‌రెడ్డి, బోరిగాం

రైతుల కోసమే నిర్మాణం

రైతులకు ఇబ్బందులు కల్గకుండా ప్రభుత్వం గోదాంలను నిర్మించింది. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్న పంటలను నిల్వ చేయడంతోపాటు రేషన్ బియ్యం కూడా నిల్వ చేసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నాం.

– శివరామకృష్ణ, గిడ్డంగులశాఖ జిల్లా మేనేజర్

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఎం.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మనోహర్ ఆర్మూర్‌కు బదిలీపై వెళ్లారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఖానాపూర్‌కు బదిలీపై వచ్చారు. నూతన కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం చైర్మన్ రాజేందర్‌ను చైర్మన్ తన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతల సమావేశం

కుంటాల: మండలంలోని సూర్యాపూర్, కుంటాల గ్రామాల్లో మంగళవారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీపీ జీవి అరుణ రమణారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు సమావేశమై రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. అనంతరం సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అగ్నిపథ్‌కు ఎంపికైన గ్రామానికి చెందిన సిందే శివాజీ పటేల్‌ను సన్మానించారు. సాంప్లీ రమేశ్, సోలంకి భీంరావు, పండిత్‌రావు పటేల్, విశ్వనాథ్, మెండె శ్రీధర్, దత్తు, రాజు తదితరులు ఉన్నారు.

‘కాంగ్రెస్‌ను ఆదరించాలి’

ఖానాపూర్: కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడి రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని పాతఎల్లాపూర్, ఒడ్డెవాడ గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దయానంద్, గంగనర్సయ్య, అబ్దుల్ మజీద్, తోట సత్యం, నిమ్మల రమేశ్, రశీద్‌బేగ్, జహీర్ తదితరులు ఉన్నారు.

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



బాధితులకు ఫోన్ అప్పగిస్తున్న ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన చెందకుండా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ సూచించారు. https:// www. ceir. gov. in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 11 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి మంగళవారం ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు 234 ఫోన్లను గుర్తించి పట్టుకున్నామని తెలిపారు. ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం తనిఖీలు నిర్వహించాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాలకు మద్యం, నగదు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న పెట్రోల్‌బంక్ పరిసరాలను పరిశీలించారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండండి



తానూరు: తనిఖీ పరిశీలిస్తున్న సీఐ వినోద్



భైంసారూరల్: తనిఖీ చేస్తున్న సీఐ నైలు, సిబ్బంది

తానూరు: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. మంగళవారం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మండలంలోని బెల్‌తరోడా వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని సీఐ పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే తెలంగాణలోకి అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. మద్యం, నగదు రవాణా కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని ఎస్సై సందీప్‌కు సూచించారు.

లింగా గ్రామం వద్ద..

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామం వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మంగళవారం సాయంత్రం భైంసారూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.

ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టండి



మాట్లాడుతున్న నాయకులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ‘కడెం ప్రాజెక్ట్ పరిరక్షణ సమితి’ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రాజెక్ట్ 15వ గేటు దెబ్బతిని వేల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయకుంటే రైతాంగంతో కలిసి అందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కడెం ప్రాజెక్ట్ పరిరక్షణ సమితి సభ్యులు పీవీ రావు, సంతోశ్‌రెడ్డి, రఫీక్, రాజు, బబ్లూ, పెద్ది శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, సత్యంరెడ్డి, సురేశ్, మల్లయ్య, రహీం, యాదగిరి, రాజన్న, తదితరులు ఉన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

లోకేశ్వరం: మండలంలోని పంచాయతీల్లో 2023–24కు సంబంధించి హరితహారం నర్సరీల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తడి,పొడి చెత్తను సేకరించాలని సూచించారు. గ్రామాల్లోని సమావేశాలకు కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

కుంటాల: ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇద్రీస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన నులిపురుగు, లెప్రసీ సర్వే వివరాలపై డబ్ల్యూహెచ్ఓ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఎండీఏటీం ప్రోగ్రాం అధికారి రాజేందర్, వైద్యులు శృతిరెడ్డి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీజేపీ నాయకులు



లోకేశ్వరం నుంచి వెళ్తున్న కార్యకర్తలు



ముధోల్: బస్సు వద్ద కార్యకర్తలు



ఖానాపూర్ నుంచి వెళ్తున్న నాయకులు



సోన్: పాకపట్ల నుంచి వెళ్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జనగర్జన సభకు లోకేశ్వరం నుంచి బీజేపీ కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, మండలాధ్యక్షుడు గంగాధర్, శ్రీధర్‌రెడ్డి, సాయినాథ్, శ్రీకాంత్, గంగాధర్, సంతోష్, గణేశ్ ఉన్నారు.

ఖానాపూర్: ఆదిలాబాద్ సభకు పట్టణంతోపాటు మండలానికి చెందిన బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో వెళ్లారు.

సారంగాపూర్: జనగర్జన సభకు మండలంలోని బీజేపీ నాయకులు విలాస్, రాంశంకర్‌రెడ్డి, సామల వీరయ్య తదితరులు తరలివెళ్లారు.

నర్సాపూర్(జి): తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్ అన్నారు. మండలం నుంచి ఆదిలాబాద్ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మండల ఉపాధ్యక్షుడు నవీన్, కార్యదర్శి మహేశ్, సాయికృష్ణ, విజయ్, సాయినాథ్, లక్ష్మణ్, అశోక్, రాజు, శివ తదితరులు వెళ్లారు.

సోన్: ఆదిలాబాద్ జనగర్జన సభకు మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మార గంగారెడ్డి, హరీశ్‌రెడ్డి, సాయన్న, బీజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలం కేంద్రంతోపాటు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు అమిత్‌షా సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన కార్మికులు

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 13 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం నుంచి సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల పెండింగ్ బిల్లులను విడుదల చేసి వేతనాలను పెంచాలని కోరారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నారాయణ, పద్మ, లక్ష్మి ఉన్నారు.

మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న కాశీనాథ్, వైద్యులు

భైంసాటౌన్: మానసిక ప్రశాంతతతోనే శారీరక ఆరోగ్యం సాధ్యమని భైంసా ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని భైంసాలో మంగళవారం గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. మైండ్ క్లినిక్ వైద్యులు అల్లాడి సురేశ్, డా.సుమల, డా ప్రీతం, డా ముష్కం రామకృష్ణగౌడ్ ఏరియాస్పత్రి నుంచి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందారు

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్:బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని సారంగాపూర్, సోన్, నిర్మల్ రూరల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోనియాగాంధీ ప్రకటించిన ఆరు హామీల పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తొమ్మిదేళ్లలో ప్రభుత్వ భూముల కబ్జాలు, దళిత బంధు, బీసీబంధు, మైనార్టీబంధు పథకాల్లో కమీషన్ తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని, వారికి ఓట్లేసి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సురేందర్...

కాంగ్రెస్ సారంగాపూర్ మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా తాంద్ర గ్రామానికి సాకొపెల్లి సురేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ అర్షదుద్దీన్ నియామక పత్రం అందజేశారు.

‘తామర’ సోయగం



ముధోల్: మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు పక్కనున్న ఖజానా చెరువులో తామర పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఆహ్లాదం పంచుతూ ఈ నీటివనం ఆకట్టుకుంటుంది.

ఖానాపూర్ ఎఫ్‌డీవో బదిలీ

ఖానాపూర్: ఖానాపూర్ అటవీశాఖ కార్యాలయంలో మూడేళ్లుగా ఎఫ్‌డీవోగా విధులు నిర్వహించిన కోటేశ్వరరావు మంగళవారం బదిలీ అయ్యారు. ఖానాపూర్ నుంచి కొత్తగూడెంకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని వినతి

ఖానాపూర్: పట్టణంలో పారిశుధ్య పనులు చేయించాలని ఎంఐఎం నాయకులు మంగళవారం నిర్మల్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి విన్నవించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలో వైద్యశిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. మినీ స్టేడియానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరు పెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో అజీం బిన్ యాహియా, అకిల్, సయ్యద్ షారు, అఫ్సర్ ఖాన్, కైఫ్ తదితరులు ఉన్నారు.